# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-01-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- సూక్ష్మ నీటి సాగు విధానాన్ని మరింత ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- మకర సంక్రాంతి భారతదేశ వైవిధ్యంలో ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.
- రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండేలా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.
- తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేటలో ఈ నెల 18 నుంచి 3 రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్ జరగనుంది.

====================

సూక్ష్మ నీటి సాగు విధానాన్ని మరింత ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నారావారిపల్లిలో రెండవ రోజు పర్యటిస్తున్న ఆయన స్థానికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ... రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని అన్నారు. ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన బాగా పెరిగిందని, క్రిమిసంహారకాలు వినియోగించని పంట ఉత్పత్తులనే ప్రోత్స హిస్తున్నారని పేర్కొన్నారు. ఆహార అలవాట్లు వేగంగా మారిపోతున్నాయిని, తదనుగుణంగా సాగు విధానంలో కూడా పెను మార్పులు రావాలన్నారు. చీడపీడల నుంచి రక్షించుకునే పద్ధతులు మారాయని మామిడిపంట రక్షణకు ఆధునిక విధానాలు వచ్చాయని ఇలాంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించాలని ముఖ్యమంత్రి రైతులకు సూచిస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

====================

మకర సంక్రాంతి భారతదేశ వైవిధ్యంలో ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. ఈ పవిత్రమైన పండుగ సూర్యుడు మకర రాశిలోకి మారడాన్ని సూచిస్తుందని.. శ్రేయస్సు, సామరస్యాన్ని పునరుజ్జీవింపజేస్తుందని ఈరోజు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. రైతుల ప్రయత్నాలను గుర్తిస్తూ.. పంట కాలాన్ని జరుపుకునే సమయమిదని ఉపముఖ్యమంత్రి తెలిపారు. సూర్యుని జీవనాధార శక్తి ప్రకృతితో మన సంబంధాన్ని పెంపొందించుకోవడంతో పాటూ.. మన జీవితంలోని అన్ని కోణాల్లో కృతజ్ఞతను పాటించడానికి ఈ పండుగ మనల్ని ప్రేరేపిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొంటూ.. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

====================

ప్రజలు సంతోషంగా ఉండేలా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాష్ట్రంలో సంక్రాంతి కళ లేదంటూ విపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. మునుపెన్నడూ లేని విధంగా పొరుగు రాష్ట్రాలు, దేశ విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు ఈ సంక్రాంతికి సొంత ఊర్లకు వస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం సుమారు 850 కోట్ల రూపాయలతో గత 6 నెలల్లో రహదారులను బాగు చేయించిందని, సమగ్ర నీటి వినియోగంతో ఈసారి పంటలు కూడా బాగా పండాయని తెలిపారు. పెండింగ్ బకాయిలతో పాటు 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు చెల్లించటంతో రైతులు సంతోషంగా పండుగ చేసుకుంటున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలియజేశారు.

====================

తిరుపతి జిల్లాలోని సూళ్లూరుపేటలో ఈ నెల 18 నుంచి 3 రోజుల పాటు “ఫ్లెమింగో ఫెస్టివల్” జరగనుందని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. నారావారి పల్లి పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలెక్టర్ కలిసి ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ కు రావాల్సిందిగా ఈ రోజు ఆహ్వానించారు. ఇదిలా ఉండగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నేలపట్టు పక్షుల అభయారణ్యంలో జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌కు దూర సుదూరాల నుంచి పక్షి ప్రేమికులు వస్తుంటారు. శీతాకాల సమయంలో పులికాట్ సరస్సుకు భారీగా వలస పక్షుల తాకిడి ఉంటుంది. ఈ సరస్సు మొత్తం విదేశాలకు చెందిన పక్షులతో నిండిపోతుంది. ఇందులో ఫ్లెమింగోలే ఎక్కువగా ఉంటాయి. ఈ ఫ్లెమింగోలను స్వాగతించేందుకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ప్రతీ సంవత్సరం నిర్వహిస్తారు.

====================

ఉత్తరాంధ్ర గిరిజనుల ఆరాధ్య దేవత, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన శంబర పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా నిన్న పోలమాంబ అమ్మవారిని శంబర గ్రామంలోకి తీసుకొని వచ్చారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈరోజు భక్తులు అధిక సంఖ్యలో ఈరోజు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. కాగా ఈ నెల 27న తోలేళ్ళ ఉత్సవం, 28న సిరిమాను సంబరం, 29న అనుపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతి సంవత్సరం ఈ జాతరకు ఉత్తరాంధ్ర నుండే కాకుండా ఒరిస్సా, ఛత్తీస్ ఘడ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

విరామం

====================

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య, తూర్పు గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలో రేపు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖా అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఈరోజు సంక్రాంతి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఊరూ వాడా కలిసి సామూహిక ఆట పోటీల్లోనూ, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. బంధువుల రాకతో ప్రతీ ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. కాగా భారతదేశంలో జరుపుకునే అత్యంత పవిత్రమైన పండుగలలో మకర సంక్రాంతి ప్రధానమైనది. దేశ వ్యాప్తంగా ఒక్కో రాష్ట్రం వారు ఒక్కో పేరుతో జరుపుకుంటారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడంతో దక్షిణాయణం ముగిసి ఉత్తరాయణం ప్రారంభమయ్యే ఈ సమయాన్ని తెలుగువారు కొత్త సంవత్సరంలో తొలి వేకువగా భావించి సంక్రాంతి పండుగగా జరుపుకుంటారు. మకర సంక్రాంతి సమయంలోనే పంట కోతలు పూర్తయి ధాన్యరాశులు రైతుల ఇళ్లకు చేరతాయి. అందుకు కృతజ్ఞతగా సూర్యుడితో పాటు ప్రకృతిని, పాడిపశువులను రైతు కుటుంబాలు పూజిస్తాయి.

====================

సంక్రాంతి పండుగను విశాఖలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్నారు. ఇంటి ముందు రంగవల్లులు తీర్చిదిద్ది సంక్రాంతిని ఆహ్వానిస్తున్నారు. సూర్యుడు ధనుఃరాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే పుణ్య సమయంలో పితృదేవతలను స్మరించుకున్నారు. పితృదేవతలను ఆరాధించి నూతన వస్త్రాలను సమర్పించుకునే ఆనవాయితిని పాటిస్తున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు కోలవెన్ను మలయవాసిని సంక్రాంతి విశిష్టతను ఆకాశవాణితో పంచుకుంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

====================

మకర జ్యోతి దర్శనార్థం అయ్యప్ప స్వామి భక్తులు ఈరోజు వేల సంఖ్యలో శబరిమలకు చేరుకున్నారు. 41 రోజుల దీక్ష తీసుకునే అయ్యప్ప భక్తులకు ఈరోజు అత్యంత ప్రాముఖ్యత కలిగిన పర్వదినం. దాదాపు 2 నెలల పాటు సాగే మకరవిళక్కు పూజలు నేటితో ముగియనున్నాయి. ఈ రోజే అయ్యప్ప స్వామి జ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిస్తారని భక్తుల విశ్వాసం. మకర జ్యోతి దర్శనంతో సంతోషం, సకల సౌభాగ్యాలు కలుగుతాయని నమ్ముతారు.

====================

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో మకర సంక్రాంతి పర్వదినాన గొబ్బెమ్మ తల్లి సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సిరి సంపదలను అనుగ్రహించే గొబ్బెమ్మ తల్లికి భక్తులు కర్పూర నీరాజనాలు పట్టారు. మకర సంక్రాంతి పర్వదినాన గొబ్బెమ్మ ఉత్సవాలకు ముగింపుగా అమ్మవారికి సింహవాహనం సేవ, గ్రామోత్సవం చేపట్టారు. ఆలయంలోని అలంకార మండపంలో గొబ్బెమ్మ తల్లి ఉత్సవమూర్తికి విశేష అలంకరణ చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి వాహనంపై కొలువుదీర్చి విశేష హారతులు సమర్పించారు. ఆతరువాత పురవీధుల్లో మంగళ వాయిద్యాలు నడుమ వైభవోపేతంగా ఊరేగించారు.

====================
====================